సాక్షి
అనకాపల్లి

మంగళవారం। 20। జూన్। 2023



సచివాలయంలో రిజిస్ట్రేషన్లు

కశింకోట గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ సచివాలయంలో రిజిస్ట్రేషన్లను సోమవారం తొలిసారిగా ప్రారంభించారు. 8లో



జగనన్నకు చెబుదాం

కలెక్టరేట్ స్పందనకు 232 అర్జీలు వచ్చాయి. ప్రతి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



మరిన్ని స్లాట్లు ఇవ్వాలి

విశాఖ: విమానాలకు మరిన్ని స్లాట్లు ఇవ్వాలని ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డిని కోరింది.

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ డిప్లమో, పీజీ కోర్సులకు దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: వచ్చే విద్యా సంవత్సరానికి లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎల్‌ఎన్‌ఐపీఈ), గ్వాలియర్‌లో స్పోర్ట్స్ డిప్లమో, పీజీ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు కె.ఆనందలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఎన్‌ఐపీఈలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ అండ్ కోచింగ్ (డీఎస్‌ఎంసీ) విభాగాధిపతి(హెచ్‌వోడీ) డాక్టర్ యజ్వేంద్ర సింగ్ రాజ్‌పుత్ ఉత్తర్వుల మేరకు ఎంపిక పరీక్షను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (విజయవాడ) నిర్వహిస్తుందన్నారు. డిప్లమో ఇన్ స్పోర్ట్స్ కోచింగ్(డీఎస్‌సీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ స్పోర్ట్స్ కోచింగ్(పీజీడీఎస్‌సీ)తో పాటు ఇతర రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి సమాచారం కోసం www.lnipe.edu.in వెబ్‌సైట్, 0751-4000887 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

26 నుంచి డేటా ఎంట్రీపై శిక్షణ

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 26న డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్య శిక్షణకు నూతన బ్యాచ్ ప్రారంభమవుతుందని సంస్థ కో ఆర్డినేటర్ ఎ.చక్రవర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులై, ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 8143229228 నంబర్‌కు సంప్రదించాల్సిందిగా కోరారు.

ఏపీఆర్‌డీసీలో ఉమాకిరణ్‌కు 25వ ర్యాంక్



ఉమాకిరణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

రోలుగుంట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వై.ఉమాకిరణ్ ఇటీవల నిర్వహించిన ఏపీ రెసిడెన్సియల్ డిగ్రీ కామన్ ఎంట్రెన్స్ రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల్లో 25వ ర్యాంకు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సహదేవుడు సోమవారం మీడియాకు తెలిపారు. నాగార్జున సాగర్, గుంటూరు కళాశాలల్లో సీటు సాధించినట్టు పేర్కొన్నారు. ఉమాకిరణ్ తమ కళాశాలలో సీఈసీ గ్రూపులో అత్యధిక మార్కులు సాధించినట్టు వెల్లడించారు. కళాశాలకు గుర్తింపు తెచ్చిన ఉమాకిరణ్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించింది.

టిడ్కో ఇళ్ల పరిశీలన

- వచ్చే నెలలో లబ్ధిదారులకు పంపిణీ
- టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ వెల్లడి



సత్యనారాయణపురంలో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్న కుమార్

అనకాపల్లి రూరల్/యలమంచిలి: అనకాపల్లి మండలం సత్యనారాయణపురం గ్రామం, యలమంచిలి పట్టణంలోని యర్రవరం ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన టిడ్కో గృహ సముదాయాలను సోమవారం టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పరిశీలించారు. సత్యనారాయణపురంలో 2,744, యలమంచిలిలో 432 టిడ్కో గృహాలు నిర్మిస్తున్నారు. గృహ సముదాయాల వద్ద కల్పిస్తున్న మౌలిక సదుపాయాల పురోగతిని అధికారులు చైర్మన్‌కు వివరించారు. వచ్చే నెలలో జిల్లావ్యాప్తంగా మొత్తం 5,768 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట టిడ్కో సూపరింటెండింగ్ ఇంజినీర్ నర్సింహమూర్తి, ఈఈ సుధాకర్, డీఈఈ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ధనిశెట్టికి ముద్రగడ పరామర్శ



ధనిశెట్టి బాబూరావును పరామర్శించిన ముద్రగడ పద్మనాభం

పాయకరావుపేట: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావును సోమవారం పరామర్శించారు. బాబూరావు సోదరుడైన పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి కృష్ణ అనారోగ్యం కారణంగా ఈనెల 4న మృతి చెందారు. అందువలన బాబూరావును ముద్రగడ పరామర్శించారు. బాబూరావుతోపాటు కుటుంబ సభ్యులు ధనిశెట్టి బుజ్జి, ధనిశెట్టి మహేష్, ధనిశెట్టి తులసి తదితరులు ఉన్నారు.

అన్ని స్టేషన్లలో ఈ మాల్ఖానా

పోలీస్ శాఖలో వినూత్న విధానాల అమలుకు వేదికగా అనకాపల్లి జిల్లా ముందంజలో నిలుస్తోంది. ప్రయోగాత్మకంగా నర్సీపట్నం, అనకాపల్లి మోడల్ స్టేషన్లలో ప్రారంభించిన ఈ మాల్ఖానా విధానం విజయవంతమయింది. దీన్ని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకూ విస్తరిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో పూర్తి స్థాయి ఈ మాల్ఖానా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న తొలి జిల్లాగా అనకాపల్లి నిలవనుంది.

- రాష్ట్రంలో తొలిసారి.. జిల్లా అంతటా ఏర్పాటు
- తొలిదశలో నర్సీపట్నం, అనకాపల్లిలో సక్సెస్
- కేసులకు సంబంధించిన పత్రాలు, ఆస్తులు భద్రం



ఈ-మాల్ఖానా డిజిటలైజేషన్ చేసిన కీలక కేసుల వివరాలు భద్రపరచిన గది

సాక్షి, అనకాపల్లి: దీర్ఘకాలంగా పెండింగ్‌లలో ఉన్న కేసుల డాక్యుమెంట్లు, స్వాధీనం చేసుకున్న వస్తువులకు ఈ-మాల్ఖానా(సాక్ష్యాధారాలను భద్రపరిచే కేంద్రం) ద్వారా భద్రత కల్పిస్తున్నారు. తొలి దశలో జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం మోడల్ పోలీస్‌స్టేషన్లలో దీన్ని ఏర్పాటు చేశారు. వీటిలో ఇప్పటికే 600కి పైగా క్రిమినల్ కేసుల పత్రాలను నమోదుచేశారు. ఇక్కడ విజయవంతం కావడంతో అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ మాల్ఖానా విధానాన్ని అమలుచేసేందుకు జిల్లా ఎస్పీ మురళీకృష్ణ శ్రీకారం చుట్టారు.

ఆరంభం అదుర్స్

న్యాయస్థానాల్లో వాయిదాలు పడుతున్న కీలక కేసుల ఆధారాలకు భద్రత కరువైంది. పోలీసుస్టేషన్లలో సిబ్బంది బదిలీ సమయంలో కొన్ని ఆధారాలు మాయమవుతున్న ఆరోపణలున్నాయి. మరికొన్ని స్టేషన్లలో చెదపట్టి డాక్యుమెంట్లు పాడవుతున్నాయి. ఇలాంటి కారణాలు ఇక మీదట ఉండరాదనే ముందు చూపుతో ఏపీ పోలీస్‌శాఖ ఈ-మాల్ఖానాను తీసుకొచ్చింది. రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండేళ్ల క్రితం అప్పటి ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు చేతుల మీదుగా నర్సీపట్నం, అనకాపల్లి మోడల్ పోలీస్ స్టేషన్లలో అమలు చేశారు.

ఆధారాల భద్రతలో కీలకం

పోలీసుస్టేషన్, న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల వివరాలను ఈ మాల్ఖానాలో ఒక క్రమపద్ధతిలో బాక్స్‌ల్లో భద్రపరుస్తారు. వాటికి నంబర్లు ఇచ్చి, ఆ నంబర్ పేరిట డిజిటలైజేషన్ చేస్తారు. సంబంధిత కేసు ఎఫ్‌ఐఆర్ నంబర్‌తో కోడింగ్ ఇస్తారు. పెండింగ్ కేసు వివరాలు కావాలనుకున్నపుడు కేసు నంబర్ ఎంటర్ చేస్తే చాలు.. ఆ వివరాలుండే బాక్స్ నంబర్ తెలుస్తుంది. దీంతో సమయం ఆదా అవుతుంది. త్వరితగతిన అవసరమైన డాక్యుమెంట్లు, వస్తువుల్ని బయటికి తీయొచ్చు.

అన్ని స్టేషన్లలోనూ అమలు



స్మార్ట్ పోలీసింగ్ విధానంలో భాగంగా తొలిసారి అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి మోడల్ పోలీస్‌స్టేషన్లలో ఈ మాల్ఖానా ఏర్పాటు చేశాం. రెండో విడతలో అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరిస్తున్నాం. నర్సీపట్నం, అనకాపల్లి పీఎస్ పరిధిలో ఇటీవల కొన్ని దీర్ఘకాలిక కేసుల్లో ఈ మాల్ఖానా ద్వారా త్వరితగతిన కోర్టుకు సంబంధిత వస్తువులు, డాక్యుమెంట్లు సమర్పించగలిగాం. ఈ విధానం రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో, కొన్ని స్టేషన్లలో మాత్రమే అందుబాటులో ఉంది. అనకాపల్లి జిల్లాలో మాత్రం అన్ని స్టేషన్లలో అమలుచేస్తున్నాం. పొరుగు జిల్లాలకు అనకాపల్లి ఆదర్శంగా నిలవనుంది.

– మురళీకృష్ణ, ఎస్పీ, అనకాపల్లి జిల్లా

ఆనంద నందనం

- నర్సీపట్నంలో కమర్షియల్ నర్సరీ
- పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన సామాజిక అటవీ విభాగం
- తక్కువ ధరకే అన్ని రకాలు మొక్కలు



నర్సీపట్నంలోని కమర్షియల్ నర్సరీ ప్రవేశ ద్వారం



నర్సరీలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన వివిధ రకాల మొక్కలు

నర్సీపట్నం: ఆదాయ వనరులను పెంపొందించేందుకు సామాజిక అటవీ విభాగం ఇంటిగ్రేటెడ్ కమర్షియల్ నర్సరీలను అందుబాటులోకి తెస్తోంది. జిల్లాలో నర్సీపట్నాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో విజయవాడలో జరిగిన అటవీ అధికారుల రాష్ట్రస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి డివిజన్‌లో కమర్షియల్ నర్సరీని ఏర్పాటు చేయమని ఆదేశించారు. దీంతో జిల్లా సామాజిక అటవీ విభాగం నర్సీపట్నం కలప డిపో ఆవరణలో కమర్షియల్ నర్సరీని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. ఈ నర్సరీలో అన్ని రకాల మొక్కలను విక్రయిస్తున్నారు.

ప్రైవేటు నర్సరీలకు దీటుగా..

అటవీశాఖ కమర్షియల్ నర్సరీని ప్రైవేటు నర్సరీలకు దీటుగా తీర్చిదిద్దింది. లాభాపేక్షతో కాకుండా అటవీ వనాలను అభివృద్ధి చేయటమే కమర్షియల్ నర్సరీల ముఖ్యోద్దేశమని అటవీ అధికారులు అంటున్నారు. ప్రైవేట్ నర్సరీల కంటే తక్కువ రేట్లకు మొక్కలు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు అటవీశాఖ కమర్షియల్ నర్సరీలో మొక్కలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. నర్సీపట్నంలో కమర్షియల్ నర్సరీ మంచి ఫలితాలు ఇస్తుండడంతో వీటిని జిల్లావ్యాప్తంగా విస్తరించనున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ నర్సరీలో రైతులకు ఉపయోగపడే వేప, నేరేడు, బాదం, కానుగ, సరుగుడు, నీలగిరి, టేకు మొక్కలను సిద్ధం చేశారు. ఇళ్లలో పెంచుకొనే క్రోటన్స్, పూలమొక్కలు, శ్రీగంధం, హైబ్రిడ్ పూల మొక్కలు, అంట్లు ద్వారా పెంచే మొక్కలను కూడా విక్రయిస్తున్నారు. వీటితోపాటు మరిన్ని ఆకర్షణీయమైన మొక్కలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

జిల్లావ్యాప్తంగా విస్తరిస్తాం



నర్సీపట్నంలో కమర్షియల్ నర్సరీలో రైతులకు అవసరమైన మొక్కలు, గృహ అలంకరణకు పనికొచ్చే క్రోటన్స్, పూలమొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటిని జిల్లా అంతటా విస్తరిస్తాం. త్వరలో అనకాపల్లిలో ఏర్పాటు చేస్తాం. అటవీ వనాలను అభివృద్ధి చేయటమే కమర్షియల్ నర్సరీ లక్ష్యం. ప్రజలు ఈ నర్సరీ సేవలను వినియోగించుకోవాలి.

–లక్ష్మణ్, డీఎఫ్‌వో, సోషల్ ఫారెస్టు

దివ్యాంగులకు అండగా..



మానసిక దివ్యాంగురాలిని వీల్ చైర్‌లో తరగతి గది వరకు తీసుకువస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: మానసిక దివ్యాంగులను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదరించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం వీరనారాయణం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మానసిక దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎం.ఆర్.కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి అర్థమైన విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా మానసిక వైకల్యం కలిగిన ముగ్గురు విద్యార్థులకు ఎం.ఆర్.కిట్స్, మరొకరికి చక్రాల కుర్చీ అందజేశారు. 8వ తరగతి విద్యార్థి తలారి శిరీషను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి డిప్యూటీ సీఎం తదితరులు తరగతి గది వరకు తీసుకొని వచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పునరుద్ధరణ పనులు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధి బొడ్డవర వద్ద ఆదివారం గూడ్స్ రైలు వేగన్స్ పట్టాలు తప్పడంతో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ ఘటన నేపథ్యంలో వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి, ఇతర అధికారుల బృందం హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పనులను పర్యవేక్షించారు. ప్రతికూల వాతావరణంలో నిరంతరాయంగా పనులను పూర్తి చేయించి సోమవారం ఉదయం 10 గంటలకు ట్రాక్‌లను పునరుద్ధరించారు. అనంతరం ఈ లైన్‌లో రాకపోకలను అనుమతించారు. ఈ సందర్భంగా సోమవారం పలు రైళ్లు రద్దు చేశారు.

- కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దు.
- విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం – కిరండూల్ (085510) పాసింజర్ స్పెషల్ రద్దు.
- కిరండూల్‌లో జూన్ 20న బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.



పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న అనూప్‌కుమార్ సత్పతి

అనకాపల్లి సుందరీకరణ

- నడుం బిగించిన మంత్రి అమర్‌నాథ్
- సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి చర్యలు
- జీవీఎంసీ అధికారులతో సమీక్ష



సమీక్షలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



హాజరైన జీవీఎంసీ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి పట్టణ సుందరీకరణతోపాటు, చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను కొలిక్కి తీసుకురావడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నడుం బిగించారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమృత పథకంలో విలీన గ్రామాలకు మంచినీటిని అందించే ప్రక్రియకు రైల్వే, హైవే అధికారుల నుంచి అనుమతులు వచ్చినందున పనులు వేగవంతం చేయాలని మంత్రి అమర్‌నాథ్ అధికారులను ఆదేశించారు. జలగల మదుం నుంచి టౌన్‌లోకి వెళ్లే రహదారిని సుందరీకరించి... రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం, రోడ్డు మధ్య డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెరుగు బజారు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, ఇప్పటికే 998 మంది విస్తరణకు అంగీకరించినందున ఆయా కట్టడాలను వెంటనే తొలగించాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. అనకాపల్లి పట్టణానికి మంజూరైన పైపులైను నిర్మాణాన్ని ఈ ఏడాది అక్టోబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా అనకాపల్లి పట్టణానికి మంజూరు చేసిన 32 హైమాస్ట్ పోల్స్‌కు విద్యుత్ దీపాలను అమర్చకపోవడం పట్ల మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వివరణ ఇస్తున్న సమయంలో జీవీఎంసీ కమిషనర్ వర్మ జోక్యం చేసుకుని లైట్లకు సంబంధించి ప్రత్యేక టెండర్లు పిలవాలని, అందుకు అవసరమైన రూ.20 లక్షలను తాను మంజూరు చేస్తానని చెప్పారు.

మురుగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

విలీన గ్రామం కొప్పాక వద్ద మురుగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి అమర్‌నాథ్ అధికారులకు సూచించారు. మురుగునీరు పోయేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయం వద్ద వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచిపోతోందని మంత్రి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. నూకాలమ్మ ఆలయం ఆర్చి నుంచి పూడిమడక వెళ్లే రహదారిని విస్తరించడానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అందుకు అధికారులు మార్గం సుగమం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లిలో గ్యాస్ ఆధారిత బరియల్ గ్రౌండ్ పనులు పూర్తి కాలేదన్న విషయాన్ని మంత్రి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి మళ్లీ టెండర్లు పిలవాలని కమిషనర్ వర్మ అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డును వేరేచోట ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అనకాపల్లి నుంచి పెందుర్తి వెళ్లే మార్గంలో ఎక్కడైనా డీ పట్టా భూమి లభ్యమైతే దానిని తీసుకొని అక్కడ గార్బేజ్ లిఫ్టింగ్ స్టేషను నెలకొల్పాలని ఆదేశించారు. 82వ వార్డులోని రజక సామాజిక భవనం, శ్రీరామ్‌నగర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాలు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

సిబ్బంది తీరుపై మంత్రి అసహనం

అనకాపల్లి మున్సిపల్ కార్యాలయం సిబ్బంది పూర్తిగా మనసుపెట్టి పనిచేయడం లేదని.. కొద్ది సమయం మాత్రమే కార్యాలయంలో ఉంటున్నారని మంత్రి అమర్‌నాథ్ అసహనం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రమైందని, పట్టణంలో సమస్యలు కూడా పెరుగుతున్నాయని, సిబ్బంది పూర్తిస్థాయిలో అనకాపల్లి కార్యాలయంలో ఉండి ప్రజల ఇక్కట్లు తీర్చాలన్నారు. ఉత్సాహంగా పనిచేసేవారిని అనకాపల్లి కార్యాలయంలో నియమించాలని మంత్రి అమర్‌నాథ్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

విశాఖలో సీపెట్!

- ఇప్పటికే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు
- ఇన్వెస్టర్లకు అవాంతరాలు లేని విశాఖ నగరం ఎంపిక
- భవిష్యత్తులో ఆర్థిక ప్రయోజనాల్లో పెట్రో కెమికల్ ముఖ్య భూమిక



సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్ నమూనా

సాక్షి, విశాఖపట్నం: యువతకు ఉజ్వల అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నైపుణ్యం, మానవ వనరుల కోసం ఎదురు చూస్తున్న పరిశ్రమల్లో ఎక్కువగా అవకాశాలు లభిస్తాయన్న ఉద్దేశంతో.. కీలకమైన ఇనిస్టిట్యూట్స్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాబోయే కాలంలో అపార అవకాశాలు లభించే కోర్సుల్ని అందించే సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)ని విశాఖలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

నిపుణులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా...

గ్రాడ్యుయేషన్ దశలోనే.. ఉపాధికి అవసరమయ్యే వినూత్న కోర్సుల్లో చేరుతూ చాలా ఈజీగా ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుంటున్నారు ప్రస్తుత యువతరం. దానికి కావల్సిన అవకాశాల్ని సృష్టిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ప్రస్తుతం మనం వాడే ప్రతి అవసరానికి ప్లాస్టిక్ అనేది కీలకంగా మారింది. గృహోపకరణాలు, ఫోన్లు.. వంటసామగ్రి.. ఇలా అనేక ఉత్పత్తులను తయారు చేసేందుకు దేశ, విదేశాల్లో చాలా కంపెనీలు ఉన్నాయి. అయితే ఈ రంగంలో పని చేసేందుకు నిపుణుల కొరత మాత్రం ప్రతి దేశంలోనూ వేధిస్తూనే ఉంది. అద్భుతమైన, అపారమైన అవకాశాలు ఉన్న ఈ రంగంలో నిపుణులను తయారు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం సీపెట్‌ని ప్రారంభించింది. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యూఎన్‌డీపీ) సహకారంతో 1968లో భారత ప్రభుత్వం మొట్టమొదటి ఇనిస్టిట్యూట్‌ని చెన్నైలో ప్రారంభించింది. ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన వివిధ విభాగాల్లో నిపుణులైన ఉద్యోగులను అభివృద్ధి చేయడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

విశాఖలో ఏర్పాటుకు ప్రణాళికలు

దేశంలో పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్(పీసీపీఐఆర్) ప్రాజెక్టు 640 చ.కిమీ విస్తీర్ణంలో ఉన్న రాష్ట్రాలు నాలుగు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలకంగా మారింది. పీసీపీఐఆర్ నోడ్ ఉన్న ఏపీలో ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌లో అవకాశాలు పెరగనున్నాయి. పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంలో ఏపీ ఇప్పటికే టాప్‌లో ఉన్న తరుణంలో.. విశాఖపట్నం, నెల్లూరులో రెండు సీపెట్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ప్రతిపాదనలు పంపించింది. అదేవిధంగా.. ఇటీవలే రాష్ట్రానికి వచ్చిన కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ శాఖ కేంద్ర కార్యదర్శి అరుణ్ బరోకాతో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి భేటీ అయ్యి.. ఇక్కడి పరిస్థితులు వివరించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే రానున్నాయని అధికారిక వర్గాల సమాచారం. జూలై 27,28 తేదీల్లో ఢిల్లీలో జరిగే గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ మూడో ఎడిషన్ సదస్సులో విశాఖలో సీపెట్ ఏర్పాటుపై నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఎంపీ సత్యవతితో ఎమ్మెల్యే బాబూరావు భేటీ

పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ



ఎంపీ సత్యవతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

అనకాపల్లి టౌన్: స్థానిక కార్యాలయంలో ఎంపీ సత్యవతిని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవరపు రాజేష్‌కన్నా, ఎస్.రాయవరం మండల సీనియర్ నాయకుడు శ్రీపతిరాజు, నక్కపల్లి మండల సీనియర్ నాయకుడు శీరం నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ దుకాణంలో అగ్నిప్రమాదం

సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం



అగ్నికి ఆహుతైన ఎలక్ట్రానిక్ పరికరాలు

అనకాపల్లిటౌన్: స్థానిక మళ్లవరపువీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాండ్రేగుల వెంకట్ ఎలక్ట్రానిక్ దుకాణంలో అగ్నిప్రమాదం సోమవారం జరిగింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. దుకాణంలో సుమారు రూ.30 లక్షలు మేర ఆస్తి నష్టం జరిగినట్టు భావిస్తున్నట్టు అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగరావు చెప్పారు.

అట్రాసిటీ కేసు నమోదు

అనకాపల్లిటౌన్: ఇరువర్గాల ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ దాడి మోహన్‌రావు సోమవారం చెప్పారు. వివరాలివి. సత్యనారాయణపురం మెగా లేఅవుట్‌లో గృహంపై ఎస్.ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తిబాబు, నాయుడులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఇదే విషయంపై బి.నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనంద్, రామారావు, చలపతిపై కులంపేరు దూషించినట్టు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

సత్వర పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ స్పందనకు 232 అర్జీలు

తుమ్మపాల: ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసమే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో అధికారులు పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ జాహ్నవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పందన అర్జీలు పునరావృతం కాకుండా ఉండాలంటే సమస్య పరిష్కారం చేసి అర్జీదారుడ్ని సంతృప్తికరంగా చేయాలన్నారు. స్పష్టమైన రీతిలో సమాధానాలు ఇవ్వాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా శాఖల అధికారుల సమక్షంలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలన్నారు. పరిష్కరించదగ్గ సమస్యలను తక్షణమే పరిష్కరించాన్నారు. ఈ వారం మొత్తం 232 అర్జీలు స్పందనలో నమోదయ్యాయి. డీఆర్వో పి.వెంకటరమణ స్పందన నమోదు కేంద్రం వద్ద వేచి ఉన్న వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

ఆక్రమణదారుల నుంచి ఇంటి స్థలం ఇప్పించండి

మా అత్త కరణం మహాలక్ష్మికి ప్రభుత్వం 1988లో ఇంటి పట్టా ఇచ్చింది. పేదరికం వల్ల పాక వేసుకున్నాం. ఇటీవల నేను అనారోగ్యం (క్యాన్సర్)తో సతమతమవుతున్న సమయంలో గ్రామానికి చెందిన వ్యక్తి మా స్థలాన్ని ఆక్రమించి భవనాన్ని నిర్మిస్తున్నాడు. అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడి చేస్తున్నాడు. తక్షణమే పనులు నిలిపివేసి మా ఇంటి స్థలం ఇప్పించాలని అనకాపల్లి మండలం మామిడిపాలేనికి చెందిన కరణం నూకలక్ష్మి స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

దివ్యాంగ పింఛను మంజూరు చేయండి...

నేను దివ్యాంగుడిని. నా కుమార్తెకు వివాహమై నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ రేషన్ కార్డులోనే ఆమె పేరు ఉంది. ఆమె ఐటీ రిటర్న్స్ చెల్లించడంతో నాకు దివ్యాంగ పింఛను మంజూరు కావడం లేదు. రేషన్ కార్డు నుంచి నా కుమార్తె వివరాలను తొలగించి పింఛన్ మంజూరు చేయాలని నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన తంతటి బాబూరావు స్పందనలో కలెక్టర్‌కు విన్నవించాడు.

రోడ్డు మరమ్మతులు చేయాలని వినతి

అనకాపల్లి – అచ్యుతాపురం రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఎస్ఈజెడ్‌లో పనిచేసే వేలాది మంది రాకపోకలు సాగిస్తున్న ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. మూడేళ్లుగా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఎన్ఏవోబీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఎన్ఏవోబీలో వేట కోల్పోయిన మత్స్యకారులు, బోటు యాజమానులకు ప్రభుత్వం, కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేపట్టారు. గతంలో చర్చలతో ధర్నాను నిలిపివేసిన అధికారులు ఇప్పటికీ వారిచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. న్యాయం చేయకపోతే మళ్లీ ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. రాంబిల్లి మండలంలో మత్స్యకార గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న డీఆర్వో వెంకటరమణ

ఎస్పీ స్పందనకు 42 అర్జీలు

అనకాపల్లి టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 42 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటూ, దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర వాటిపై అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ చక్రధర్ పాల్గొన్నారు.

కోర్టులో కేసు ఉండగానే లీజుకు...

మునగపాక మండలం సంతబయలు మధ్య వీధిలో ఏడడుగుల రహదారి స్థలం విషయంలో 2018లో అనకాపల్లి కోర్టులో కేసు నడుస్తుండగా, పక్కనే టి.అనసూయ, రమణబాబు ఆ స్థలాన్ని ఎ.సత్యనారాయణకు లీజుకు ఇచ్చారు. ఈ విషయంపై ఈనెల 16న మునగపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సివిల్ సమస్యగా చెప్పారని, పరిశీలించి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన కె.తాతమ్మరాజు, కె.ఎస్.వి.గణేష్, కె.వి.వి.సత్యనారాయణ స్పందనలో ఫిర్యాదు చేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

భూమిని అక్రమంగా విక్రయించారు..



అనకాపల్లి మండలం ఊడేరు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 9–4లో 28 సెంట్ల భూమి గునుకూరి రాముకు లీజుకు ఇచ్చాను. అందులో యూకలిప్టస్ మొక్కలు వేసి ఉన్నాను. ఈ నేపథ్యంలో రాము కుమారులు చిన వెంకటరమణ, శ్రీనురాజ్, కాసుబాబు ఏకమై భూమికి ఎటువంటి సంబంధం లేని సిరసపల్లి సీతారామయ్యతో కలిసి బోగస్ పత్రాలతో దిబ్బపాలెం గ్రామానికి చెందిన దాడి రోహిత్‌కు ఫిబ్రవరి 10న అనకాపల్లి రిజిష్టర్ కార్యాలయంలో అక్రమంగా విక్రయించారు. వీరిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన సిరసపల్లి వెంకటరావు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.


కల్యాణపులోవ రిజర్వాయర్ అభివృద్ధికి వినతి




ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న తాతబాబు, రాము

అనకాపల్లి టౌన్/రావికమతం: జిల్లాలో కల్యాణపులోవ రిజర్వాయర్ అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని రావికమతం మండలం దొండపూడి గ్రామ సర్పంచ్ తాతబాబు, రిజర్వాయర్ చైర్మన్ గంటిరెడ్డి రాము, ఉప సర్పంచ్ రాజారావు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ వెంకట సత్యవతికి సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రిజర్వాయర్‌ను అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ, ఎంపీ నిధుల్ని త్వరలోనే విడుదల చేస్తామని భరోసానిచ్చారు. ఇటీవల అదే మండలం గర్నికంలో ఎంపీ దృష్టికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కల్యాణపులోవ కాలువ సమస్యను తీసుకురాగా రూ.పది లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ సత్యనారాయణదొర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పేదింటి విద్యార్థుల ప్రతిభ



సుగుణ



పవన్‌కుమార్

రావికమతం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు పేదింటి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. బుడ్డిబంద గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని రొబ్బా సుగుణ ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 1,139వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి వీరభద్రరాజు వ్యవసాయ కూలీ. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన సుగుణ ఇంటర్మీడియట్‌ను విజయవాడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమిలో చదివింది. రావికమతం గ్రామానికి చెందిన దమ్ము గోవిందరావు, లక్ష్మి దంపతుల కుమారుడు వీరవెంకట చైతన్య పవన్‌కుమార్ ఆలిండియా ఓబీసీ కేటగిరీలో 1,210వ ర్యాంకు సాధించాడు. ఇటీవల ఎంసెట్ ఫలితాల్లో 411వ ర్యాంకు వచ్చింది. ఐఐటీ ముంబాయి, ఖరగ్‌పూర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. వీరిని తల్లిదండ్రులతోపాటు పలువురు అభినందించారు.

గ్రానైట్ క్వారీలను నడిపింది మీ ఎమ్మెల్యేనే..

టీడీపీ నిరసనకారులతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: గ్రానైట్ క్వారీలకు తాను మొదటి నుంచి వ్యతిరేకినని, గతంలో టీడీపీ ఎమ్మెల్యే స్వయంగా వాటిని నడిపేవారని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మైదాన గిరిజన గ్రామాలను ఐటీడీఏలో చేర్చడం మంచిదేనని, అది తన పరిధిలో లేని అంశమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చీమలపాడు గ్రామానికి విచ్చేసిన ఆయన కారు వద్దకు టీడీపీ గ్రామ నాయకులు గోర సంజీవ్, వెంకటరమణ, బొండా దేముడు, జనసేన కార్యకర్త కొత్తెం అప్పారావు వెళ్లారు. తమ గిరిజన గ్రామాలను పాడేరు ఐటీడీఏలో చేర్చాలని, కల్యాణపులోవ ప్రాంతంలో గ్రానైట్ క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దని నినాదాలు చేయగా ధర్మశ్రీ పై విధంగా స్పందించారు.

ఏమైనా సమస్యలున్నాయా...

అనంతరం గిరిజన గ్రామాలైన కల్యాణపులోవ, ములకలాపల్లి, చీమలపాడులో సోమవారం ధర్మశ్రీ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైనా బిల్లులు రాలేదని కల్యాణపులోవలో బొండా రమణమ్మ తదితరులు వాపోయారు. గువ్వమ్మ, రాజమ్మలకు ఇళ్ల స్థలాలు, సెగ్గె చిన్ని, రాజులమ్మలకు ఇళ్లు మంజూరు చేస్తామని ధర్మశ్రీ హామీ ఇచ్చారు. ములకలాపల్లిలో రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ చిన్ని చినమ్మలు కోరగా రూ.10 లక్షల టీటీడీ నిధులతో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్ ఒంజరి గంగరాజు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు పాల్గొన్నారు.



సమస్యలేమైనా ఉన్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

రామన్నపాలెం వద్ద గోపాలపట్నం వాసి మృతి

వేసవి తాపం తాళలేక మృతి!

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెం వాటర్‌ట్యాంక్ వద్ద గోపాలపట్నంకు చెందిన నీలపు అప్పారావు(45) సోమవారం తెల్లవారు జామున పడి ఉన్నాడు. స్థానికులు పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా, వారి దర్యాప్తు మేరకు మృతుని వివరాలను తెలుసుకున్నారు. మృతుని కుటుంబీకులను రప్పించి 174 సీఆర్‌పీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబీకులు, పోలీసులు చెప్పిన సమాచారం మేరకు అప్పారావు వేసవి తాపానికి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడు రాడ్ బైండింగ్ వర్క్ చేసుకుంటూ ఎక్కడ పనిచేస్తే అక్కడే ఉండిపోతాడని, ఈ క్రమంలోనే అప్పారావు వారం రోజులుగా రామన్నపాలెంలో రాడ్‌బైండింగ్ పనులు చేసుకుంటూ ఆదివారం రాత్రి పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతునికి అనారోగ్య సమస్యలు ఉన్నట్టు బంధువులు తెలిపారు.



మృతుడు నీలపు అప్పారావు(45)

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

గొలుగొండ: స్థానిక కస్తూర్బా బాలికల వసతి గృహంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మైనర్ బాలిక అదృశ్యంపై గొలుగొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మండల పరిధిలో ఉన్న తాళ్ల చీడికాడ గ్రామానికి చెందిన బాలిక నాలుగు రోజుల క్రితం గొలుగొండలో ఉన్న కస్తూర్బా బాలికల వసతి గృహంలో చేరింది. అయితే ఆదివారం సాయంత్రం తన కుటుంబ సభ్యులు వచ్చారని తెలుపుతూ బాలిక కస్తూర్బా వసతి గృహం నుంచి బయటకు వచ్చింది. అయితే గంట సమయం అయినా ఆ బాలిక వసతిగృహానికి తిరిగి రాకపోవడంతో కస్తూర్బా ప్రత్యేక అధికారి సుధ గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సోమవారం చింతపల్లి ప్రాంతంలో బాలిక ఉన్నట్టు తెలియడంతో సిబ్బందితో విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

రెండు తులాల బంగారు తాడు అపహరణ

మునగపాక: మండలంలోని నాగులాపల్లికి చెందిన మహిళ మెడలోని రెండు తులాల బంగారు తాడు అపహరణకు గురైంది. ఈ మేరకు మునగపాక పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. వివరాలివి. నాగులాపల్లికి చెందిన మొల్లేటి పద్మ వైఎస్సార్ ఆసరా పథకంలో తనకు మంజూరైన నగదు తీసుకునేందుకు ఆటోపై మునగపాక ఎస్‌బీఐకు బయలుదేరింది. బ్యాంక్ ఎదురుగా ఆటో నుంచి దిగింది. బ్యాంక్ లావాదేవీలు పూర్తి చేసుకొని నాగులాపల్లిలోని తన ఇంటికి చేరుకుంది. తన వద్ద ఉన్న నగదును బీరువాలో ఉంచుదామని మెడలో ఉన్న తాడుకు ఉన్న తాళం తీసేందుకు ప్రయత్నించింది. మెడలో తాడు లేకపోవడంతో ఆందోళనకు గురై మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు తులాల తాడు సుమారు రూ.లక్షా 25వేలకు పైగా ఉంటుందని తెలిపారు. ఆటోలో కూర్చొన్న తరువాత ఏం జరిగిందో తెలియడం లేదని తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ మన్మథరావు మునగపాక మెయిన్‌రోడ్డులోని పలు సీసీ కెమెరాలను పరిశీలించారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్లు

కశింకోట : కశింకోట గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ సచివాలయంలో రిజిస్ట్రేషన్లను సోమవారం తొలిసారిగా ప్రారంభించారు. దీనిలో భాగంగా సేల్ డీడ్, రిసీప్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం సంబంధిత వ్యక్తులకు రిజిష్టర్ పట్టాల పత్రాలను అందించారు. కార్యక్రమంలో అనకాపల్లి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఏఎస్ఎన్ మూర్తి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, పంచాయతీ ఈవో ఎస్.రమేష్, 2వ సచివాలయ కార్యదర్శి అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తియ్యగెడ్డలో మహిళ హత్య

- పాడేరులో యాచకుల మధ్య ఘర్షణ...ఒకరి మృతి
- ఒకే రోజు రెండు ఘటనలతో ఉలిక్కిపడిన జనం

పాడేరు రూరల్: పాడేరు మండలంలో ఒకే రోజు రెండు హత్యా సంఘటనలు చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందాడు. పాడేరు మండలం తియ్యగెడ్డ గ్రామంలో ఓ మహిళ హత్యకు గురవ్వగా పాడేరు పట్టణంలో ఇద్దరు యాచకుల మధ్య జరిగిన ఘర్షణలో మరో యాచకుడు హత్యకు గురయ్యాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించి పోలీసులు ఎటువంటి వివరాలు ఇంకా వెల్లడించలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి. మాడుగుల మండలం కోరాపల్లి గ్రామానికి చెందిన కోరాబు గాయత్రి అనే మహిళ భర్తతో విడిపోయి వేరుగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన గణపతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్టు సమాచారం. మూడు రోజుల క్రితం గణపతి తమ బంధువుల గ్రామమైన పాడేరు మండలం తియ్యగెడ్డకు ఆమెను తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో ఈనెల 16న వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఆమెను చీరతో ఉరేసి చంపేసి గ్రామ శివార్లో పూడ్చి పెట్టినట్టు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న వనుగుపల్లి సర్పంచ్ భర్త, వీఆర్వో సదానందరావు, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సోమవారం గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడు గణపతి పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిసింది.



మృతి చెందిన యాచకుడు

యాచకుల మధ్య ఘర్షణలో...

పాడేరు పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా వెంకటేశ్వర లాడ్జీ ఎదురుగా ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం ఇద్దరు యాచకులు మత్తులో ఘర్షణకు దిగారు. స్థానికులు కలుగజేసుకొని వారిని అక్కడి నుంచి పంపించివేశారు. కానీ మరలా వీరి మధ్య పీఎంఆర్సీ దరి కేవీఆర్ ఫార్చున్ హోటల్ ఎదురుగా రాత్రి ఘర్షణ జరగడంతో ఓ యాచకుడు తన వద్ద ఉన్న కత్తితో మరో యాచకుడిని పొడిచాడు. దీంతో దీంత్రో తీవ్ర గాయాలై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

- బిడ్డకు జన్మనిచ్చిన కొద్ది రోజుల్లోనే..
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

మునగపాక: బిడ్డకు జన్మనిచ్చిన కొద్ది రోజుల్లోనే బాలింత ఆరోగ్యం విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని రామగిరిలో చోటు చేసుకుంది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలివి. రామగిరికి చెందిన పల్లా జయగణేష్ అచ్యుతాపురంలోని ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య చిన్నారి(19) నిండు గర్భిణి. ఆమెకు ఈ నెల 11న రాత్రి పురిటి నొప్పులు రావడంతో ఉమ్మనీరు పోయింది. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు స్థానిక ఆశ కార్యకర్త, ఏఎన్ఎంల సూచన మేరకు సమీపంలోని చూచుకొండ పీహెచ్‌సీకి తరలించారు. 12వ తేదీన మధ్యాహ్నం 1 గంట వరకు చిన్నారికి డెలివరీ చేసేందుకు వైద్య సిబ్బంది యత్నించారు. ఆదివారం కావడంతో వైద్యులు అందుబాటులో లేరు. అయినప్పటికీ వైద్యుని పర్యవేక్షణ లేకుండానే ప్రసవం చేయడానికి ప్రయత్నించారు. గర్భిణి పరిస్థితి విషమించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అంబులెన్స్‌లో ఆమెను అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడ పెద్ద ఆపరేషన్ చేసి మగ శిశువుకు జన్మనిచ్చారు. ఈ నెల 14వ తేదీ వరకు తల్లికి బిడ్డకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. తల్లి చిన్నారికి జ్వరం, బీపీ రావడంతో వందపడకల ఆస్పత్రి వైద్యుల సూచనల మేరకు అదే రోజు సాయంత్రం 4గంటలకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 16వ తేదీన చిన్నారి కోమాలోకి జారుకుంది. దీంతో ఐసీయూలో చేర్చారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మధ్యాహ్నం 2 గంటలకు చిన్నారి మృతి చెందింది. దీంతో భర్త జయగణేష్, తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమై మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చారు. అంత్యక్రియలు జరిపారు. ఇలా ఉండగా జ్వరంతో బాధపడుతున్న శిశువును అనకాపల్లి ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. మూడు రోజులు చికిత్స అందించాక శిశువును రామగిరికి తీసుకువచ్చారు. కాగా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని భర్త జయగణేష్ వాపోతున్నారు. తల్లి లేని బిడ్డ పరిస్థితి ఎలా ఉంటుందోనని కలవరపడుతున్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకపోవడం, పరిస్థితి విషమించినా తన భార్యను ఆస్పత్రికి తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయడం వల్ల చిన్నారి ప్రాణాల మీదకు తెచ్చిందన్నారు. ఈ విషయమై చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా తన తండ్రికి సీరియస్‌గా ఉందని తెలిసి హుటాహుటిన సోమవారం ఆసుపత్రి నుంచి అత్యవసరంగా వెళ్లారని వైద్య ఉద్యోగి తెలిపారు.

డిగ్రీలో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానం

చోడవరం రూరల్: ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెట్టిందని చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా విద్యార్థులు ఈ నెల 24వ తేదీ వరకు తమ పేర్లను ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లు ఎంచుకోవాలన్నారు. చోడవరం డిగ్రీ కళాశాలకు సంబంధించి మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ జువాలజీ, బీకామ్ జనరల్, బీఏ ఎకనామిక్స్‌లో ప్రతి విభాగంలో 40 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. మైనర్ సబ్జెక్టులుగా బీఎస్సీ మేథ్స్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ ఫిజిక్స్‌లో ప్రతి విభాగంలో 40 సీట్లు, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ హిస్టరీలలో 60 సీట్లు మేరకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా కోర్సుల వారీగా ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు గురించి రోజూ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వీటిపై సందేహాల నివృత్తి కోసం సంప్రదించాలన్నారు.

చెట్టు నుండి జారి పడి వ్యక్తి మృతి

గొలుగొండ: మండలంలో చోద్యం గ్రామానికి చెందిన ఎ.సత్తిబాబు అనే వ్యక్తి చింత చెట్టు నుంచి జారి పడి సోమవారం ఉదయం మృతి చెందాడు. సత్తిబాబు తన ఇంటి వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కి కొమ్మలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు మృతిచెందాడు. దీనిపై కృష్ణదేవిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ...ఒకరి మృతి

యలమంచిలి: స్కూటీని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. వివరాలివి. విజయనగరం జిల్లా గుర్ల మండలం చింతపల్లిపేట గ్రామానికి చెందిన సత్తారపు చౌదరి నాయుడు(38) స్కూటీపై స్వగ్రామం వెళుతుండగా యలమంచిలి జాతీయ రహదారిపై యర్రవరం భారత్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం సాయంత్రం 7గంటల సమయంలో తుని నుంచి అనకాపల్లి వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ పై ప్రయాణిస్తున్న చౌదరి నాయుడు తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు వచ్చి ఫిర్యాదు చేశాక కేసు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

క్లుప్తంగా

బట్లపూడిలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని బట్లపూడి గ్రామంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

నేటి నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు



కశింకోటలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలను నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఏటా ఆషాఢ మాసంలో 9 రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశితో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు, చివరి రోజు రథోత్సవాన్ని నిర్వహించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో జగన్నాథ స్వామి, బలభద్రస్వామి, సుభద్ర ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. ఉత్సవాలు ముగిసే వరకు ప్రతి రోజు ఉత్సవ విగ్రహాలకు ఆలయ మండపంలో విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అనకాపల్లిటౌన్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేస్తారని పేర్కొన్నారు. మండల పరిధి గ్రామాల్లో ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 114 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,700	4,020
మూడోరకం	2,800	3,300

అనకాపల్లి సినిమాలు

ఆదిపురుష్	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్ 1 యూనిట్, ఏబీ పాజిటివ్ 2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఈ కేవైసీ.. ఇక సులభం



సంపతిపురంలో పీఎం కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది



రేబాకలో ఈకేవైసీ చేయిస్తున్న అధికారులు

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఆర్థిక సాయానికి ఈకేవైసీ తప్పనిసరి. ఈకేవైసీ చేయకుంటే తమ బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాదు. చాలా మంది రైతులు వివిధ కారణాలతో దీన్ని పూర్తి చేయట్లేదు. ఇలాంటి వారి కోసం తమ ఇళ్ల వద్దే ఈకేవైసీ చేయించుకునేందుకు వీలుగా కిసాన్ యాప్ అందుబాటులోకి వచ్చింది. దీంతో శతశాతం రైతులు ఈకేవైసీ నమోదుకు వీలవనుంది.

- అందుబాటులోకి కిసాన్ యాప్
- నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలు
- ఇప్పటివరకు సబ్ డివిజన్‌లో 85శాతం పూర్తి

అనకాపల్లి రూరల్ : రైతు భరోసా సాయం అందాలన్నా, పీఎం కిసాన్ సొమ్ము బ్యాంక్ ఖాతాకు జమ కావాలన్నా ఈకేవైసీ నమోదు తప్పనిసరి. దీంతో ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ-పంట నమోదు చేసుకున్నా, ఈకేవైసీ పూర్తికాక ఏటా సుమారు 15-20 శాతం మంది రైతులు ఆర్థిక లబ్ధిని పొందలేకపోతున్నారు. ఈకేవైసీపై అవగాహన లేమి, రైతులు సమయానికి అందుబాటులో లేకపోవడమే దీనికి కారణమని అధికారులు చెప్తున్నారు. ఈకేవైసీలో రైతుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై రైతులు ఈకేవైసీ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పనిలేదు. స్మార్ట్ ఫోన్ సాయంతో తమ ఇంటి వద్దే దీన్ని పూర్తి చేసుకోవచ్చు.

డివిజన్‌లో 85 శాతం పూర్తి

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో మొత్తం 41,085 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి. ఇప్పటివరకూ 35,058 మంది రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఇంకా 6,027 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వీరందరికీ పీఎం కిసాన్ యాప్ ద్వారా ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 100 శాతం ఈకేవైసీ పూర్తి చేసేందుకు కిసాన్ యాప్ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉండడం, నమోదు సులభతరం కావడంతో ఈ సారి రైతులందరితో ఈ కేవైసీ పూర్తి చేయించి, వీలైనంత ఎక్కువమంది రైతులు ప్రభుత్వ సాయం పొందేలా అధికారులు కృషి చేస్తున్నారు. వారం రోజులుగా ఈకేవైసీ తక్కువగా నమోదైన గ్రామాల్లో అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతూ కిసాన్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇబ్బందులకు చెక్

ప్రారంభంలో వ్యవసాయ గ్రామ సహాయకులు అందుబాటులో ఉన్న రైతుల వేలి ముద్రలు తీసుకుని ప్రక్రియ పూర్తి చేసేవారు. మిగిలిన వారిని ఫోన్ ద్వారా సంప్రదించి, వారికి వచ్చిన ఓటీపీ ద్వారా నమోదు చేశారు. కొంత మంది రైతులు ఓటీపీ చెప్పేందుకు నిరాకరించడం, భూ యజమానులు మరణించడం, భూమి పూర్తి వివరాలు ఆన్‌లైన్ కాకపోవడం, మ్యుటేషన్ చేయించకపోవడం వంటి సాంకేతిక కారణాలతో ఈకేవైసీ పూర్తి కావడంలేదని అధికారులు అంటున్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు ఈ సారి పీఎం కిసాన్ మొత్తం జమ కాదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు స్పందించి వీలైనంత త్వరగా ఈ కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

స్మార్ట్ ఫోన్ ద్వారా ఇలా..

ఈక్రాప్, ఈకేవైసీ ముఖ ఆధారిత విధానంలో నమోదు ప్రక్రియ ఎవరికి వారే పూర్తి చేసుకోవచ్చు.

అనకాపల్లి సబ్ డివిజన్‌లో ఈకేవైసీ వివరాలు ఇలా..

మండలం	రైతులు	ఈకేవైసీ పూర్తి	పెండింగ్ రైతులు
అనకాపల్లి	11,718	9,999	1,719
కశింకోట	7,470	6,650	820
మునగపాక	7,790	6,711	1,079
సబ్బవరం	9,314	7,450	1,864
పరవాడ	4,793	4,248	545

ముందుగా స్మార్ట్‌ఫోన్ లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి పీఎం కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. కిసాన్ యాప్‌లో ఆధార్ సంఖ్య నమోదు చేయగానే పీఎం కిసాన్ దరఖాస్తులో నమోదు చేసిన చరవాణి నంబరుకు ఓటీపీ వస్తుంది. దీనికి ఆధార్ లింక్‌తో సంబంధం ఉండదు. ఓటీపీ నమోదు చేయగానే ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఫోన్‌లోని ముందు కెమెరా ఎదుట కళ్లు కదిలిస్తే యాప్‌లో ఓకే అని వస్తుంది. దీంతో ఈకేవైసీ ప్రక్రియ పూర్తయినట్టుగా పూర్తి వివరాలు వస్తాయి.

ఎక్కడి నుంచైనా ఈకేవైసీ



రైతులు ఈకేవైసీని నమోదు ఎక్కడి నుంచైనా పూర్తి చేసుకోవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలో మా సిబ్బంది ప్రస్తుతం చాలా మందికి ఈకేవైసీ పూర్తి చేస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలి.

– పీయూటీపీ రంగాచారి, ఇన్‌చార్జి ఏడీఏ, అనకాపల్లి

అర్హులందరికీ జగనన్న గృహాలు





డ్రైనేజీ నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (ఇన్‌సెట్) పక్షవాతంతో బాధపడుతున్న అప్పారావుతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- సీసీ రోడ్ల నిర్మాణంలో అధికారులకు ప్రజలు సహకరించాలి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : అర్హులైన వారందరికీ సకాలంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మండలంలోని శంకరం గ్రామంలో సర్పంచ్ పసుపులేటి లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హతలుండీ.. సొంతిల్లు లేని వారందరికీ జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. ఇరుకిరుకు ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఇబ్బందుల్ని చూసి చలించిపోయారు. అక్కడే ఉన్న తహసీల్దార్‌ను పిలిచి, అంగన్‌వాడీ కేంద్రానికి 5 సెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయించి, శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో భాగంగా మంత్రి అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. ఒక్కో లబ్ధిదారునికి తమ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్లను అందించారు. స్థానిక సమస్యల్ని తెలుసుకుని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చల్లని దీవెనలందించి ముఖ్యమంత్రిగా మనందరి ప్రియతమ నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అభ్యర్థించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కావలసిన నిధులను మంజూరు చేస్తామన్నారు. సచివాలయం పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దోబీఖానా నిర్మాణానికి రూ.5 లక్షలు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్‌తో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో కోతులు బెడద వదిలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులతో సహకరించాలని సూచించారు.

గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్న అడ్డూరి చిన్నప్పారావును కలిసి ధైర్యం చెప్పారు. వైద్యానికైన ఖర్చుల వివరాలిస్తే సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన రూ.15 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు పసుపులేటి రామకృష్ణ, ఉపసర్పంచ్ గుడాల తాతబాబు, మాజీ ఉపసర్పంచ్ గుడాల మణిబాబు, గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య



విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. గవరపాలెం జీవీఎంసీ చిన్నహైస్కూల్లో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అమ్మ ఒడి పథకంలో నేరుగా వారి తల్లి ఖాతాలో రూ.13 వేలు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం హైస్కూల్లో ఈ ఏడాది టెన్త్‌లో 570కి పైగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తన సొంత నిధులతో 50 గ్రాముల చొప్పున వెండి, ప్రశంసా పత్రంతో సత్కరించారు. 550కి పైగా మార్కులు వచ్చిన వారికి కూడా 20 గ్రాముల చొప్పున వెండి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎం.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు కాండ్రేగుల శ్రీరామ్, కోటిపల్లి జేజిబాబు, దాడి ఈశ్వరరావు, యల్లపు శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ సూరిశెట్టి సన్యాసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలకరితో ఉపశమనం



తాళ్లపాలెం వారపు సంత

కశింకోట : మండలంలో సోమవారం తొలకరి జల్లులు కురిశాయి. ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. కశింకోటలో తక్కువగాను, తాళ్లపాలెం ప్రాంతంలో కాస్త వర్షం పడింది. దీంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఎండ తీవ్రత తగ్గింది. గత కొంత కాలంగా అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. తాళ్లపాలెంలో జరిగిన వారపు సంతకు వర్షం కారణంగా గొర్రెలు, మేకలు తక్కువగా వచ్చాయి. సంత ప్రాంతంలో కాస్త ఎక్కువగా వర్షం కురిసింది. దీంతో గొర్రెలు, మేకల సంత బురదమయంగా మారి వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడ్డారు. అయితే కూరగాయల సంత వాతావరణం చల్లగా ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కళకళలాడింది.

స్థిరంగా టమాటా ధర:

వారంపు సంతలో కిలో టమాటా ధర రూ.50 వద్ద స్థిరంగా ఉంది. ఉల్లిపాయలు రూ.20, బంగాళా దుంప, వంకాయ రూ.30, బెండకాయ, దొండకాయ రూ.40, బీరకాయ, బీట్‌రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



స్వామివారి సన్నిధిలో దాడి రత్నాకర్, కార్పొరేటర్ లక్ష్మీసౌజన్య, రాంబాబు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీ సుభద్ర బలభద్ర సమేత శ్రీ జగన్నాథస్వామివారి దేవస్థానం రథోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. స్థానిక జగన్నాథస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవార్లకు ఆయన పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణ మహోత్సవం వేదమంత్రాల నడుమ అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, ఆలయ ఈవో ఆదినారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం



టెన్త్ టాపర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీధర్‌రాజు

కశింకోట : స్థానిక బాలికోన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో మండల స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డీపీఎన్ జెడ్పీ హైస్కూల్, బాలికల హైస్కూల్‌తోపాటు మండలంలోని పది పాఠశాలలకు చెందిన టెన్త్ టాపర్లను ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పేదలు ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, హెచ్‌ఎంలు ఎం.ఎస్.స్వర్ణకుమారి, ఆచంట రవి, ఎంఈవో కె.చిట్టిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గా మల్లేశ్వరుల కల్యాణం



దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణంలో దంపతులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం సతకంపట్టు శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవం ముగింపు వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఆలయ ఆవరణలో దుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణాన్ని కొణతాల జస్వంత్, కృష్ణతేజ దంపతులు, దాడి హేమకుమార్, కోమలి దంపతులచే ఆలయ ప్రధాన అర్చకులు భోగాపురపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్ నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు కల్యాణం అనంతరం పసుపు కుంకుమలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, పాలిమేర శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చవగ్గా మామిడి పండ్లు



తాళ్లపాలెం వారపు సంతలో విక్రయిస్తున్న నాణ్యమైన బంగినపల్లి మామిడి పండ్లు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం మామిడి పండ్ల అమ్మకాలు తక్కువ ధరకు జోరుగా సాగాయి. ఎగుమతి నాణ్యత కలిగిన బంగినపల్లి రకం మామిడి పండ్లు డజన్ రూ.వందకే విక్రయించారు. పరిమాణం పెద్దగా ఉంటే రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయాలు సాగాయి. సువర్ణరేఖ, రసాలు ఇంకా తక్కువ ధరకు విక్రయించారు. పరిమాణం అనుసరించి మూడున్నర నుంచి ఐదు డజన్ల వరకు ఉండే క్రేట్ మామిడి పండ్లు సంతలో టోకుగా రూ.200 నుంచి రూ.350 వరకు విక్రయించారు. మండలంతోపాటు చుట్టు పక్కల ఉన్న మాకవరపాలెం, రావికమతం, నర్సీపట్నం, బుచ్చియ్యపేట నుంచి మామిడి పండ్లను ఎక్కువగా తెచ్చి క్రేట్ల లెక్కన విక్రయించారు. సంతలో సుమారు 500 క్రేట్ల వరకు విక్రయాలు సాగినట్లు స్థానికులు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల : ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21న విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ డీఈ కె.రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పట్టణంలోని ఉమ్మలాడ రోడ్డు, పూడిమడక రోడ్డు జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్, రామాలయం వీధి, ఇనుపకొట్టు నాగేశ్వరరావు ఏరియా, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, సాయి కుల్వంత్ కళాశాల, శారదా కాలనీ, పాత బర్మా కాలనీ, పరశురాం పేట, నాలుగురోడ్ల కూడలి నుంచి శారదా నది వరకు, నరసింగరావుపేట, అవతార్ మోహర్ బాబా వీధి, జీవీ కోటేశ్వరారావు వీధి, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, నాలుగురోడ్ల జంక్షన్ నుంచి దిశ స్టేషన్ వరకు, వేల్పులవీధి రామాలయం, న్యూకాలనీ, పర్తి సాయి, షిరిడీ సాయి థియేటర్, టౌన్ గరల్స్ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

ఎంఈవో-2గా కేఎస్‌ఎన్ మూర్తి బాధ్యతల స్వీకరణ

కశింకోట : మండల విద్యా శాఖాధికారి(ఎంఈవో)-2గా కేఎస్‌ఎన్ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన తాజా పదోన్నతుల్లో ఎంఈవో-2గా ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఎంపీడీవో వి.వి.రవికుమార్‌ను కలిసి పదవీ బాధ్యతలు చేపట్టారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

అనకాపల్లిటౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు వెల్లడించారు. పైలెట్ ప్రాజెక్టు కింద సోమవారం మండలంలోని సీహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కార మార్గాలను అన్వేషిస్తామన్నారు. దీనిలో భాగంగా 10 రకాల సర్టిఫికెట్లను కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఈవోఆర్డీ ధర్మారావు, ఆర్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ ఆవరణలో ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయుర్వేద వైద్య నిపుణులు కె.లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడంతోపాటు వ్యాధులను, ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామకోటి పుస్తకాల అందజేత



అనకాపల్లిటౌన్ : ఏడాది పాటు రాసిన రామకోటి పుస్తకాలను భక్తులు సోమవారం గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో ఉన్న శ్రీరామకోటి స్థూపంలో వేశారు. స్థూపం నిర్వాహకులు కె.శివకుమార్ దంపతులు రామకోటి పుస్తకాలను భక్తులచే స్వయంగా స్థూపంలో వేయించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఏటా ఆషాఢ శుద్ధ పాడ్యమిన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరీ సేవాసంఘం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.